క్లుప్తంగా

నల్లమలలో ట్రాఫిక్ జామ్



మన్ననూర్: నల్లమల ప్రాంతంలో పలు ఉత్స వాలతో సందర్భంగా శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ పెరిగి శని వారం మన్ననూర్ అటవీశాఖ చెక్‌పోస్టు నుంచి కుంచోనిమూల వరకు సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తింది. దక్షిణ భారతదేశంలోని మరో అమర్‌నాథ్‌గా పిలువబడే సలేశ్వరం ఉత్సవాలు, మద్దిమడుగు పుణ్యక్షేత్రంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శని, ఆది వారాలు రెండు రోజులు సెలవు దినాలు కావడంతో శ్రీశైలం క్షేత్రం సందర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటూ ఇతర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో వాహనాల్లో భక్తులు నల్లమల ప్రాంతానికి తరలివస్తున్నారు. దీంతో వాహనాల సంఖ్య అధికమై ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తింది. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు పోలీసులు, ఫారెస్టు అధికారులు, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చారకొండ: మండలంలో నిజాంపల్లిలో లస్కర్ సురేష్ రోడ్డు ప్రమాదంలో, బోదాసు జంగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో సురేష్‌కు రూ.60 వేలు, జంగమ్మకు రూ. 25వేలు మంజూరయ్యాయి. శనివారం గ్రామంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు బాల్‌రాజు బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లీశ్వరి, కదారి జంగయ్య యాదవ్, తదితరులు ఉన్నారు.

తైక్వాండో నూతన కార్యవర్గం ఎన్నిక



కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో శనివారం జిల్లా తైక్వాండో నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు తెప్ప శ్రీను తెలిపారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా తెప్ప శ్రీను, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా స్వాతి, వైస్ ప్రెసిడెంట్‌గా సామ నాగరాజు, జాయింట్ సెక్రటరీగా భాను ప్రకాష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పరమేష్, మహేష్, ఎస్.కె.శిరిన్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారికి జిల్లా అధ్యక్షుడు నియామక పత్రాలు అందజేశారు.

నేడు శివరామాంజనేయ ఉత్సవాలు



తిమ్మాజిపేట: మండల కేంద్రం తిమ్మాజిపేటలో శివరామాంజనేయ స్వామి దేవాలయం 15వ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పూజారులతో ఆదివారం ఉదయం 8 గంటలకే పూజా కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దాచేపల్లి వేణుగోపాల్ తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో 13 వార్డులో విద్యుత్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా సింగిల్ విండో డైరెక్టర్ చంద్రయ్య విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్ వేయించారు. దీంతో ఎస్సీ కాలనీ ప్రజల విద్యుత్ సమస్య తీరింది. కార్యక్రమంలో మహేష్, ఎల్లయ్య, మల్లేష్, రాముడు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై ఫిర్యాదు

బిజినేపల్లి: గుడ్లనర్వ గ్రామానికి చెందిన రైతులు తాము వేసిన జొన్నల్లో ఎలాంటి దిగుబడి రాలేదని ఏప్రిల్ 4వ తేదీన వ్యవసాయశాఖ ఏడీకి ఫిర్యాదు చేశారు. యాసంగి సీజన్‌లో ప్రజ్ఞా ఎంటర్ ప్రైజెస్ వ్యాపారి వద్ద తీసుకున్న జొన్న విత్తనాలలో దిగుబడి లేదని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఏడీ నీతి వివరణ కోరగా క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టామని, దిగుబడిలో తేడాలు ఉన్నాయని పేర్కొన్నారు.



కల్వకుర్తిలో ఆంజనేయస్వామి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



కోడేరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

- ఆలయాల్లో ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు
- హోమాలు నిర్వహించిన భక్తులు
- ఊరూరా హనుమంతుడి జయంతి వేడుకలు

సాక్షి, నెట్‌వర్క్: శ్రీరామదూత హనుమంతుడి జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలో, మండల కేంద్రాలు, గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించారు. రామాలయాల్లో, ఆంజనేయ స్వామి ఆలయాల్లో అంజనేయుడికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణతో సాయంత్రం ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. డప్పుళ్ల చప్పుళ్ల, కోలాటాలు, భజనలు, డీజే పాటలతో వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

- తాడూరు మండలం కేంద్రంలోని హన్‌మాన్ ఆలయంలో పూజారి వెంకటేశ్వర శర్మ, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో హోమం నిర్వహించి, ఆంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.
- కోడేరు, వివిధ గ్రామాల్లో హనుమాన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి నిర్వహించారు. కోడేరులో అభయ ఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకం, ప్రత్యేక పూజలు అర్చకులు రాఘవేంద్రశర్మ చేశారు. సాయంత్రం శోభాయాత్రలో ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఐ గోకారి బందోబస్తు నిర్వహించారు.
- పెద్దకొత్తపల్లి, దేవునితిర్మలాపూర్‌లో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో హన్‌మాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు సింధూరం పంపిణీ చేశారు.
- పెంట్లవెల్లి, మంచాలకట్ట, గోపులాపురం గ్రామాలలో ఘనంగా హనుమాన్ జయంతి నిర్వహించారు. పలు ఆలయాలలో ఆకుపూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
- వెల్దండ మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో హన్‌మాన్ దేవాలయంలో అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ర్యాలీ నిర్వహించారు.
- తిమ్మాజిపేట, పలు గ్రామాల్లో సాయంత్రం హనుమంతుడి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. తిమ్మాజిపేట, మరికల్, పోతిరెడ్డిపల్లి గ్రామాలలో ట్రాక్టర్లలో హనుమంతుడి చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. కాషాయ జెండాలతో యువకులు పోతిరెడ్డిపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహించారు.



పెద్దకొత్తపల్లి హన్‌మాన్ దేవాలయంలో పూజలు



పెంట్లవెల్లిలో ఆకుతోట ఆంజనేయస్వామికి..



తిమ్మాజిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

భక్తిభావంతో మెలగాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి రూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతనతో మెలిగితే జీవితం ఎంతో ఉన్నత స్థాయికి చేరుతుందన్నారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ బాలాజీ సింగ్, మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎడ్మ సత్యం, రాచోటి శ్రీశైలం, తదితరులు ఉత్సవాలలో పాల్గొన్నారు.



పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

సిర్సవాడలో అభిషేకం



తాడూరు: మండలంలోని సిర్సవాడ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా పూజారి జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం అష్టోత్తర పూజ నిర్వహించారు. హైమావతి రాంచంద్రారెడ్డి, రాఘవమ్మ రవీందర్‌రెడ్డి దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఇంటింటి సర్వే



బల్మూర్: మండలంలోని రాంనగర్ కాలనీలో ఎన్‌ఎస్‌ఎస్ వేసవి కాల శిబిరంలో ఆరో రోజు విద్యార్థులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సమగ్ర వివరాలు, వ్యవసాయ రైతులు, ఉద్యోగులు, కార్మికులు, పడిపరిశ్రమ వివరాలను సేకరించారు. అనంతరం గ్రామంలో చెట్లు నాటారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా.వెంకటయ్య, డా.కృష్ణగోపాల్, ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్బతి అంజన్నకు ప్రత్యేక పూజలు

మన్ననూర్: అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సతీమణి మాజీ జెడ్పీటీసీ, సీబీఎం ట్రస్టు చైర్మన్ డాక్టర్ అనురాధ మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామికి నాయకులు, కార్యకర్తలతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. హనుమ జయంతి వేడుకలలో పాల్గొన్న ఆమె హనుమాన్ గాయత్రి యజ్ఞం, మృత్యుంజయ యజ్ఞం నిర్వహించి తన భర్త ఆరోగ్యం బాగుండాలని స్వామి వారికి మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాములునాయక్, ఈఓ నర్సింహులు శర్మ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినారాయణ, చైర్మన్‌లు మాధవరెడ్డి, మల్లేష్, సుబ్బదాస్, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ వైస్‌ఎంపీపీలు ప్రణిత, సంబు శోభ, సుజాత, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి అనురాధ

పూలే ఆశయాలు కొనసాగిస్తాం



పూలే చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న కేవీపీఎస్, ప్రజా సంఘాల నాయకులు

తెలకపల్లి: జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిస్తామని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న అన్నారు. శనివారం రాయిపాకుల గట్టు నెల్లికుదురు దళిత సమస్యలపై సర్వే నిర్వహించారు. అనంతరం జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మా జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాలే కాకుండా సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాట చేశారన్నారు. కార్యక్రమంలో చింత శివకుమార్, రవీందర్, కృష్ణ, కాశం, శ్రీశైలం, శివ, రాములు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం



కోడేరు: మండల కేంద్రంలో, నాగులపల్లి, ముత్తిరెడ్డిపల్లి, జనుంపల్లి, గుండ్యావాల్యానాయక్ తండాలో మాజీ ఎంపీపీ కొత్త రాంమోహన్‌రావు, తహసీల్దార్ విజయ్‌కుమార్ సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. పేదల ఆకలి తీర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ ఖరీం, చలపతిరావు, జగదీశ్వర్‌రావు, పొండేళ్ల సురేష్, చామంతి రాజు, మాజీ వార్డు సభ్యులు ఆదిరాజు, బాబు, ఇమ్రాన్‌ఖాన్, డీలర్లు సీహెచ్ శ్రీనివాసులు, శారద, మాజీ ఎంపీటీసీ పార్వతి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

చారకొండ: ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి, ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎం భగవాన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉపాధ్యాయ బృందంతో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఉపాధి కూలీల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వ సౌకర్యాలు తదితర వాటిపై వివరించారు. మన స్థానిక పాఠశాలలో సంఖ్య పెంచేవిధంగా గ్రామస్తులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

వెల్టూరులో 'గాం చలో బస్తీ'

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరులో శనివారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 'గాం చలో బస్తీ' కార్యక్రమం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి ఏళ్ల సురేందర్‌రెడ్డి, గ్రామ ఇన్‌చార్జి దేరేడ్డి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు తోళ్ల మహేష్‌యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, పద్మలతారెడ్డి పాల్గొన్నారు.

అండగా ఉంటాం

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన వృద్ధుడు కూన తిక్కలయ్య మరణించడంతో వారి కుటుంబానికి చెన్నకేశవ సంఘం తరుపున శనివారం ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



వెల్దండ: మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో శనివారం సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన గోపాల్ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. అతను సీఈఐఆర్‌యాప్‌లో దరఖాస్తు చేసుకోవడంతో క్రైమ్ కానిస్టేబుల్ అంజినాయక్ సెల్‌ఫోన్ గుర్తించి బాధితుడికి అందజేశారు. సెల్‌పోయిన వెంటనే బాధితులు టెక్నాలజీని ఉపయోగించుకోని ఫిర్యాదు చేసుకోవాలని సీఐ సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడూరు: మండల కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 33 కేవీ లైన్లకు చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఆదివారం ఉదయం 8 నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు విద్యుత్ అదనపు ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతో పాటు యాదిరెడ్డిపల్లి, గుంతకోడూరు, అల్లాపూర్, పాల్మూరు, అకునెల్లికుదురు, మేడిపూర్, గుట్టలపల్లి, వెంకటాపూర్‌లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన సాకలి సాయిలమ్మ మృతి చెందడంతో గ్రామానికి చెందిన శెట్టి రాజేష్, విష్ణువర్ధన్‌రెడ్డిలు శనివారం ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎంపీటీసీ ఊషన్న, సాకలి శంకర్, కారుకొండ వేంకటేష్, వీరస్వామి, సుదర్శన్ తదితరులు పేర్కొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేద్దాం

నాగర్‌కర్నూల్: ఈ నెల 27న వరంగల్ ఎలుకతుర్తి గ్రామంలో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభను జయప్రదం చేద్దామని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ప్రత్యేక ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు మన కేసీఆర్ అని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అన్ని విధాలుగా మన రాష్ట్రాన్ని దేశంలోని అగ్రగామిగా నిలిపారని గుర్తు చేశారు. గతంలో ఏ ప్రాంతీయ పార్టీకి లేని చరిత్ర బీఆర్‌ఎస్‌కు ఉందని, 14ఏళ్ల ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి దేశానికి రోల్ మోడల్ చేశాడన్నారు. ప్రజలంతా మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ రావాలని బలమైన ఆకాంక్షతో ఉన్నారని, కేసీఆర్ వల్లనే తమకు మేలు జరిగిందని చెప్పుకొస్తున్నారన్నారు.

వరంగల్ సభకు భారీగా తరలిరావాలి

వెల్దండ: 27న వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పిల్లి శ్రీను రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మాజీ ఎమ్మెల్యే కార్యకర్తను పరామర్శించి రూ.5వేలు అందజేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి, మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

తిమ్మాజిపేట: మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. కోడుపర్తిలో పార్టీ కార్యకర్త కుర్మయ్య కుమారుడు, తిమ్మాజిపేటలో కర్నెప గురువయ్య కుమారుడి వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. గుమ్మకొండలో పోషయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కనులపండువగా విమాన రథోత్సవం

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన విమాన రథోత్సవం(పెద్ద తేరు) ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున కనుల పండువగా నిర్వహించారు. రథాన్ని పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. రథంలో సీతారామచంద్ర స్వామి, సమేత లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసిన కోలాటాలు, భజన కీర్తనలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. రథానికి మహిళలు మంగళహారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పూజారి భాస్కర్, సభ్యులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



విమాన రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



లింగాలలో మాట్లాడుతున్న సీడీపీఓ దమయంతి

లింగాల/చారకొండ: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి కోరారు. పోషణ పక్షోత్సవాలలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ 22 వరకు పోషణ పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు కేంద్రాల దగ్గరనే భోజనాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శాంత, ఏఎన్‌ఎం రాజీబాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు గిరిజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- చారకొండ మండలంలోని జూపల్లిలో అంగన్‌వాడీ సెంటర్–2లో అంగన్‌వాడీ టీచర్ నారాయణమ్మ పోషణ పక్ష సంబరాలు నిర్వహించారు. పిల్లల ఎదుగుదలకు తీసుకోవాల్సిన ఆహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం బాలామృతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సెంటర్ టీచర్ కృష్ణమ్మ, లక్ష్మమ్మ గర్భిణులు, బాలింతలు ఉన్నారు.



జూపల్లిలో అవగాహన కల్పిస్తున్న నారాయణమ్మ

సమయం కంటే ముందే బడికి తాళం

కొల్లాపూర్ రూరల్: పాఠశాల సమయం ఉండగానే ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులను వదిలి పాఠశాలకు తాళం వేసి వెళ్లిన సంఘటన కొల్లాపూర్ మండలం మాచినేనిపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్న సమయంలో ఒంటిపూట బడులు నడుస్తున్నాయి. మాచినేపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు లోకేష్ 11.40గంటలకు బడి మూసి తాళం వేసి వెళ్లిపోయాడు. ఈ విషయంపై లోకేష్‌ను వివరణ కోరగా తనకు హెల్త్ సమస్య ఉండడంతో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శోభారాణికి చెప్పి, 12.30 గంటల వరకు సమయం ఉండగా, ముందే విద్యార్థులకు పరీక్షలు పెట్టి 11.40 గంటలకు మూసిపోయినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎంఈఓ ఇమ్మానుయేల్‌ను వివరణ కోరడంతో ఈ పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం పరిధిలోకి వస్తుందని, మంగళవారం విచారణ చేపడతామని పేర్కొన్నారు. మూసి ఉన్న పాఠశాలను గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ నాయక్ సందర్శించారు. ఉన్నత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడి నుండి డీఈఓ రమేష్ కుమార్, యంఈఓ ఇమ్మానుయేల్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు, విద్యార్థి యువజనులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారెడు శివశంకర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక లక్ష్మణాచారి భవనంలో నిర్వహించిన ప్రజా సంఘాల నాయకుల రౌండు టేబుల్ సమావేశం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన రైతు రుణమాఫీ, రైతు భరోసాను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి బండి లక్ష్మీపతి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాసులు, బుగ్గస్వామి, ఏఐవైఎఫ్ ఉపాధ్యక్షులు కేశవులు, శివకృష్ణ, బాలపీరు, వెంకటస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్

కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుదాం

కొల్లాపూర్: కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుతామని కేవీపీఎస్ నాయకులు అన్నారు. శనివారం కొల్లాపూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో 'కులవివక్షపై ప్రతిఘటనలు, పోరాటాలు' అనే పేరుతో కేవీపీఎస్ నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా కేవీపీఎస్ మండల కార్యదర్శి బత్తిని రాజు మాట్లాడారు. నేటి ఆధునిక యుగంలో కూడా కులవివక్ష కొనసాగుతుండడం బాధాకరమన్నారు. దీన్ని అడ్డుకునేందుకు చదువుకున్న ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంజు, సాయికుమార్, నిరంజన్, శ్రీనివాసులు, మీసాల కురుమయ్య తదితరులున్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు